నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 28 ఆగస్టు 2024 | KAMAREDDY

## 'నేను మొండిని.. వడ్డీతో సహా చెల్లిస్తా'

"'నేను కేసీఆర్ బిడ్డను. తప్పు చేసే ప్రసక్తే లేదు. మొండి దాన్ని. మంచిదాన్ని. అనవసరంగా నన్ను జైలుకు పంపి జగమొండిని చేశారు. నన్ను, నా కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేసిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తాం. చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తాం. క్షేత్ర స్థాయిలో మరింత నిబద్ధతతో పని చేస్తాం'

– జైలు నుంచి విడుదలైన తర్వాత కవిత





బాన్సువాడలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు


**న్యాయం గెలిచింది.. అక్రమ నిర్బంధానికి తెర పడింది.** ప్రశ్నించే గొంతుకపై కేంద్రం కక్ష గట్టి, అక్రమ కేసులు పెట్టి నిర్బంధించింది. నెలల తరబడి కారాగారంలో నాలుగు గోడలకే పరిమితం చేసి మానసికంగా హింసించింది. కానీ న్యాయాన్ని, ధర్మాన్ని చెరబట్టి ఎన్ని రోజులు బంధించగలరు? నియంతృత్వంతో ప్రజాస్వామ్యాన్ని ఎన్నాళ్లు నియంత్రించగలరు? అక్రమ నిర్బంధాలతో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడిన తరుణంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు న్యాయస్థానాలపై నమ్మకం పెంచింది. నిర్బంధ సంకెళ్ల నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు కోర్టు విముక్తి కల్పించింది. తద్వారా భారతావనిలో న్యాయవ్యవస్థ ఇంకా బతికే ఉందని దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోమారు నిరూపించింది. కోర్టు ఆదేశాలతో కవిత జైలు నుంచి మంగళవారం విడుదల కావడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంబురాలు మిన్నంటాయి. బీఆర్‌ఎస్ శ్రేణులు ఆనందోత్సాహాలతో పటాకులు కాల్చి స్వీట్లు పంచి పెట్టాయి.

–నిజామాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# న్యాయం గెలిచింది

## ఎమ్మెల్సీ కవిత విడుదల

- రాజకీయ కక్షసాధింపులో భాగంగానే అరెస్టు
- ఐదు నెలలకు పైగా అక్రమ నిర్బంధం
- మొక్కవోని దీక్షతో కవిత న్యాయ పోరాటం
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు దక్కిన న్యాయం
- తీహాడ్ జైలు నుంచి విడుదల
- సంబురాల్లో మునిగిన బీఆర్‌ఎస్ శ్రేణులు





డిచ్‌పల్లిలోని హన్మాన్ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

**రాజకీయంగా** కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే దమ్ము లేక అక్రమంగా కేసులు పెట్టిన బీజేపీ ప్రభుత్వానికి చెంపదెబ్బ తగిలేలా సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. లేనిపోని ఆరోపణలతో నిరూపితం కాని అంశాల్లో ఎమ్మెల్సీ కవిత పేరును చేర్చి దర్యాప్తు సంస్థలు ఇబ్బందులకు గురి చేసిన సంగతి తెలిసిందే. కేవలం అప్రూవర్లు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని కవితను ఏకంగా ఐదు నెలలకు పైగా అక్రమంగా జైలులో నిర్బంధించారు. ఎట్టకేలకు న్యాయ వ్యవస్థను నమ్ముకున్న బీఆర్‌ఎస్‌కు న్యాయం దక్కింది. కవితకు బెయిల్ మంజూరు కావడంతో ఆమె అభిమానులు, బీఆర్‌ఎస్ శ్రేణులు, జాగృతి కార్యకర్తలంతా సంబురాలు చేసుకున్నారు. ఈడీ కవితను మార్చి 15న అక్రమంగా అరెస్టు చేయగా, అదే క్రమంలో సీబీఐతోనూ అరెస్టు చేయించిన కేంద్రంలోని బీజేపీ అధినాయకత్వం పైశాచిక ఆనందాన్ని పొందింది. 165 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించినప్పటికీ తప్పులను రుజువు చేయలేకపోయింది. రాజకీయ పార్టీలకు తొత్తులుగా వ్యవహరిస్తూ వారు చెప్పినట్లుగానే ఆడి పాడిన దర్యాప్తు సంస్థల వైఖరిని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కవితకు బెయిల్ మంజూరు చేసిన సమయంలో ఈడీ, సీబీఐలకు తలంటింది.



ఆర్మూర్‌లో స్వీట్లు పంచుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

**బీజేపీ రాజకీయ కక్ష..**

ఉద్యమ పార్టీగా తెలంగాణలో స్థిరమైన నాయకత్వాన్ని పెంపొందించిన బీఆర్‌ఎస్ పార్టీ అంచెలంచెలుగా ఎదిగింది. అరవై ఏండ్ల తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను కేసీఆర్ సాకారం చేశారు. స్వరాష్ట్రంలో సీఎంగా పదేండ్ల కాలంలో తెలంగాణను పునర్నిర్మించారు. దేశ రాజకీయాల్లో అరంగేట్రం చేసి భావి భారత సమాజాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దాలని భారత రాష్ట్ర సమితికి కేసీఆర్ పురుడు పోశారు. పార్టీని విస్తరిస్తున్న క్రమంలో కేంద్రంలోని బీజేపీకి కన్నుకుట్టినట్లయింది. బీఆర్‌ఎస్ ఎదుగుదలను ఓర్వలేక ఆదిలోనే అంతం చేయాలని కక్షపూరితంగా వ్యవహరించింది. ఇందులో భాగంగానే సంబంధం లేని కేసును తెరపైకి తీసుకొచ్చి, బీఆర్‌ఎస్ అధినేత కూతురు పేరును చేర్చి నైతికంగా దెబ్బకొట్టేందుకు పావులు కదిపారు. ఏడాదిన్నర కాలంగా బీజేపీ చేసిన రాజకీయ ఎత్తుగడతో కవితకు ఇబ్బందులు తప్పలేదు. మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా కేసులు బనాయించి విచారణ పేరుతో జైలుకు పంపి హింసించారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బ తీయాలనే ఏకైక లక్ష్యంలో భాగంగానే బీజేపీ అనేక కుట్రలకు తెర లేపింది. ఇందుకు ఆ పార్టీ ఎంపీ లు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్‌లు చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. పదేపదే సీబీఐ, ఈడీ విచారణ తీరుపై అందరి కన్నా ముందుగానే ఈ ఇద్దరు ఎప్పటికప్పుడు జోస్యం చెబుతూ పైశాచికత్వాన్ని పొందారు. బీజేపీ ఎంపీలు చెప్పినట్లుగానే దర్యాప్తు సంస్థల తీరు కొనసాగడంతో కవితను ఇబ్బంది కించడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనన్న అభిప్రాయం అందరిలోనూ కలిగింది.

## ధర్మమే గెలిచింది..



భారతదేశం మొత్తం ఆమె వైపు చూస్తున్నది. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూశారు. ధర్మం ఎప్పటికైనా గెలుస్తుందని ధర్మాసనం తీర్పుతో మరోసారి తేటతెల్లమైంది. ఎమ్మెల్సీ కవితది అందరికీ సహాయం చేసే గుణం. ఆమెకు న్యాయం దక్కింది.

**- దాదన్నగారి మధుసూదన్‌రావు, న్యాయవాది**

## మహిళాలోకం ఎదురుచూస్తున్నది



ఎమ్మెల్సీ కవిత కోసం రాష్ట్ర మహిళాలోకం ఎదురుచూస్తున్నది. బెయిల్ మంజూరు కావడంతో అంతటా పండుగ వాతావరణం నెలకొన్నది. మహిళల కోసం, మహిళా సంక్షేమం కోసం పాటుపడే ఎమ్మెల్సీ కవిత వెంటే న్యాయం, ధర్మం నిలిచింది.

**- విశాలిని రెడ్డి, మాజీ కార్పొరేటర్**

## సడలని ధైర్యంతో..

దాదాపుగా ఆరు నెలల పాటు జైలు జీవితం అనుభవించిన కవిత సడలని ధైర్యాన్ని ప్రదర్శించారు. రౌస్ ఎవెన్యూ కోర్టులో కేసు వాదనలో భాగంగా తరచూ మొక్కవోని ధైర్యాన్ని చూపెట్టారు. నిర్బంధాల మధ్యనే చేతిని బిగించి జై తెలంగాణ నినాదాన్ని ఢిల్లీ వేదికగా నినదించి కేసీఆర్ బిడ్డగా సడలని విశ్వాసాన్ని ప్రదర్శించారు. సీబీఐ, ఈడీ దర్యాప్తు తీరును ఎండగడుతూనే, ఎప్పటికప్పుడు కుటిల ప్రయత్నాలపై గళం వినిపిస్తూ వచ్చారు. 165 రోజుల పాటు విశ్వాసం కోల్పోకుండా న్యాయస్థానాలపై నమ్మకంతో కవిత నిలబడి చివరికి దేశ అత్యున్నత న్యాయస్థానం ద్వారా బెయిల్ దక్కించుకున్నారు.



ఎడపల్లిలో పటాకులు కాల్చుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



భీమ్‌గల్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## సంబురాలు

ఖలీల్‌వాడి, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్, జాగృతి శ్రేణులు మంగళవారం సంబురాలు నిర్వహించాయి. నిజామాబాద్ నగరంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, పార్టీ నగర అధ్యక్షుడు సిర్పరాజు మాట్లాడుతూ న్యాయం ఎటువైపు ఉంటే అటే ధర్మాసనం మొగ్గు చూపుతుందన్నారు. ఉద్యమకారులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

**క్యాంపు కార్యాలయంలో..**

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కవిత క్యాంపు కార్యాలయంలో మంగళవారం భారత జాగృతి నేతలు సంబురాలు జరుపుకొన్నారు. భారత జాగృతి నాయకుడు అవంతిరావు, ఉద్యమకారుడు చింత మహేశ్, ప్రవీణ్‌రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్‌ఎస్, భారత జాగృతి నాయకులు



నిజామాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అలీఖాన్ @ఘరానా దొంగ

- ఏకంగా 102 కేసుల్లో నిందితుడు
- అరెస్టు చేసిన కామారెడ్డి పోలీసులు
- బంగారం స్వాధీనం

కామారెడ్డి రూరల్, ఆగస్టు 27: అతడో ఘరానా దొంగ. ఒకటి, రెండు కాదు ఏకంగా 102 కేసుల్లో నిందితుడు. కామారెడ్డి ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తే విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. కామారెడ్డి జిల్లా దేవునిపల్లి ఠాణాలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సైలు రాజు, మధుసూదన్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. దేవునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని గోష్కరాజయ్య కాలనీకి చెందిన ఇంజమూరి రాములు ఇంట్లో ఇటీవల చోరీ జరిగింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రామన్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మంగళవారం నరసన్నపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో చిక్కాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, గోష్కరాజయ్య కాలనీలో జరిగిన దొంగతనం, కామారెడ్డిలో బైక్ చోరీ చేసింది అతడేనని తేలింది. అలాగే అతడి గురించి పూర్తి వివరాలు సేకరించగా విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు హైదరాబాద్ టోలిచౌకీ పారామౌంట్ కాలనీకి చెందిన మీర్ కజామ్ అలీఖాన్ అలియాస్ సూర్యాభాయ్‌గా గుర్తించిన పోలీసులు అతడిపై ఉన్న కేసులు చూసి షాక్ అయ్యారు. హైదరాబాద్ కమిషనరేట్‌తోపాటు సంగారెడ్డి జిల్లా పరిధిలోని 102 కేసుల్లో అలీఖాన్ నిందితుడని గుర్తించారు. విచారణలో దొంగతనం చేసినట్లు అంగీకరించిన అతడు.. నగలు దాచిన ప్రాంతానికి తీసుకెళ్లగా, పోలీసులు బంగారంతోపాటు ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితున్ని కామారెడ్డి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు. ఘరానా దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన దేవునిపల్లి ఎస్సై రాజు, ఎస్సై-2 మధుసూదన్‌రెడ్డి, క్రైం కానిస్టేబుల్ రామస్వామి, బాలకృష్ణ, హోంగార్డు రాజు, టెక్నికల్ సిబ్బంది రోహిత్, శ్రీనులను ఎస్పీ సింధూశర్మ అభినందించారు.

# పడకేసిన చద్మల్ తండా

- ప్రతి ఇంట్లో జ్వర బాధితులు
- వైద్యం కోసం వేలల్లో ఖర్చు
- వేధిస్తున్న కీళ్లనొప్పులు

**ఈ తండాలో** ఏ ఇంట్లో చూసినా.. జ్వరంతో బాధపడుతున్నవారే దర్శనమిస్తున్నారు. తీవ్రమైన జ్వరంతోపాటు ఒళ్లు, కీళ్ల నొప్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. వేల రూపాయలను ఖర్చు చేస్తూ ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. విషజ్వరాలతో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం చద్మల్ తండాతోపాటు చుట్టుపక్కల తండాల వారు సైతం మంచంపడుతున్నారు.

– గాంధారి, ఆగస్టు 27



చద్మల్ తండాలో జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు

జ్వరంతోపాటు కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ.. వేలల్లో డబ్బు లు ఖర్చు చేసుకుంటున్నారు. అయినా రోజుల తరబడి వ్యాధి నయం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే అదునుగా చేసుకొని ఆర్‌ఎంపీ, పీఎంపీలు జ్వరం తగ్గడం కోసం అధిక డోసు ఉన్న ఇంజెక్షన్లు ఇస్తున్నారని, దీంతో సైడ్‌ఎఫెక్ట్ బారిన పడే అవకాశం ఉన్నదని తండావాసులు అంటున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించాలని కోరుతున్నారు. సుమారు నాలుగు వేల జనాభా ఉన్న తండాలో పరిసరాలన్నీ కంపు కొడుతున్నాయి. ప్రత్యేకాధికారుల పాలన ఉండడంతో తండాల్లో పారిశుధ్యంపై పర్యవేక్షణ కరువైంది.



తండాలో రోడ్లపై పారుతున్న మురికి నీరు

## ఒళ్లు, కీళ్ల నొప్పులు తగ్గుతలేవు..



వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న. ఒళ్లు, కీళ్ల నొప్పులు బాగా ఉన్నాయి. ప్రైవేటు దవాఖానలో చూపించుకున్నా. ఇంట్లో అందరూ జ్వరంతో బాధపడుతున్నరు. ఇప్పటికే వేల రూపాయలు ఖర్చయ్యాయి.

**- మాలి నారాయణ, చద్మల్‌తండా**

## వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం..

చద్మల్ తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలందిస్తాం. సర్వే నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తాం. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

**- సాయి కుమార్, డీడీవో, ఉత్తునూరు పీహెచ్‌సీ**

## వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

ఖలీల్‌వాడి, ఆగస్టు 27: సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టంగా కృషి చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను మంగళవారం తనిఖీ చేసి అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాలను, ఫీవర్ వార్డు, ఆపరేషన్ థియేటర్, శస్త్రచికిత్స వార్డు, రక్తనిధి కేంద్రం, ఎలిసా టెస్ట్ సెంటర్, టీ-హబ్ సెంటర్ తదితర వాటిని సందర్శించి పనితీరును పరిశీలించారు. దవాఖానకు ప్రతిరోజూ సగటున ఎంతమంది రోగులు వస్తున్నారని, డెంగీ, మలేరియా తదితర విషజ్వరాలతో ఎంత మంది చికిత్స పొందుతున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి అందుతున్న వైద్య సదుపాయాలపై వాకబు చేశారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో రాజశ్రీ తదితరులు ఉన్నారు.



రోగితో మాట్లాడుతున్న కలెక్టర్